జ్యోతి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ :

# హైట్-క్లాజ్ లైఫ్

వి. ఎల్. ఆర్



ఆఫీసు అయిన తర్వాత "కోటి" దగ్గరబస్సెక్కి— దోమల్‌గూడ చేరుకున్నాను. బస్ స్టాప్‌నుంచి ఇల్లు దగ్గిరే. ఆఫీసులో జరిగిన సంఘటనే పదేపదే గుర్తుకొస్తోంది. మా వింగ్‌కి వారంరోజుల కిందటే కొత్త డైరెక్టరొచ్చారు. ముప్ఫయికీ నలభైకీ మధ్య ఉంటుంది ఆయన వయస్సు. ప్రిమేచూర్లీ బాల్డు. కాని ముఖంలో ఏదో ఆకర్షణ. ఎబవ్ ఎవరేజ్ హైట్, అందుకుతగ్గ లావు.

"కూర్చోండి" అని రావుగారు అంటే భుజాలచుట్టూ నిండుగా పైట సరుకుని కూర్చున్నాను. తల ఎత్తేసరికి ఆయన నన్నే పరీక్షగా చూడటం గమనించి కళ్ళుదించుకున్నాను.

"టేక్ డౌన్ ఎ లెటర్" ఆయన పలికిన తీరు ఆంగ్లభాషకే కొత్త అందాన్నిచ్చింది.

పూర్తిగా ఒకపేజీ వచ్చే వుత్తరాన్ని సుమారు ఐదు నిమిషాల్లో డిక్టేట్ చెయ్యడం పూర్తిచేశారు. ఆయనకు పూర్వం వుండే డైరెక్టరు ఇదే నిడివిగల ఉత్తరం డిక్టేట్ చెయ్యడానికి పావుగంట పట్టేది, రెండు మూడు సిగరెట్లు ఖర్చయ్యేవి.

ఉత్తరం టైపుచేస్తూ ఆ ఉత్తరంలోని అంశాలను గురించే ఆలోచిస్తున్నాను. ఎనిమిదేళ్ళ నుంచి 'టైపిస్టు' పోస్టులోనే వుంటూ స్టెనో వర్కు కూడా చేస్తున్నాను. ఈ ఎనిమిదేళ్ళలో ఇద్దరు డైరెక్టర్లు వచ్చారు, వెళ్ళారు. నా స్థితిలో మార్పురాలేదు. ఈయన వచ్చిన కొద్ది రోజులలోనే ఆఫీసు స్థితినంతా తెలుసుకొని రిపేరుకు నడుం కట్టారు. టైపిస్టు పోస్టుని స్టెనో టైపిస్టుగా కన్వర్టుచేసి, ప్రస్తుతం ఆ పోస్టులో వున్న శ్రీమతి సరస్వతికి, అంటే నాకు, రెండు ఎడ్వాన్సు ఇంక్రిమెంట్సు ఇవ్వాలన్నది ఒక సిఫారసు. పాతికేళ్ళ సర్వీసు వుండి సూపరెంటుగానే రెండు మూడేళ్ళలో రిటైరవాల్సిన సోమనాధంగారి పోస్టును అసిస్టెంటు డైరెక్టరుగా కన్వర్ట్ చెయ్యాలన్నది రెండవ సిఫారసు. ఎడిషనల్‌గా రెండుయు.డి.సి. ఒక ఎల్. డి. సి. పోస్టులు క్రియేట్ చెయ్యాలన్నది మూడవ సిఫార్సు. ఈ సిఫార్సులతో డిపార్టుమెంట్ సెక్రెటరీకి వ్రాసిన డి.ఓ. లెటర్ అది. నేను ఉద్యోగంలో చేరిన తర్వాత ఇంత శ్రద్ధగా డైరెక్టరు డిక్టేటుచేసిన డి. ఓ. లెటర్ ఇదే.

లెటర్ టైపుచెయ్యడం పూర్తిచేసి నేనొకసారి చదివి తప్పులు కనిపించకపోయినా, సోమనాధంగారికి చూపించేను. అనుభవము, మంచితనం, సమర్థత వుండి ఆఫీసులో అందరికీ ప్రీతి పాత్రుడయిన ఆయన ఏ పేపరునైనా ఓ.కె. చేస్తే ఇంకెవ్వరూ ఆ పేపరులో తప్పు పట్టలేరు.

"వెల్‌డన్ అమ్మాయ్! మనకి మంచిరోజులొస్తున్నాయన్న మాట" అన్నారు నవ్వుతూ. ఉన్నదాంతో సంతృప్తి పడటమేకాని రానిదాని కోసం విచారించే తత్వం కాదాయనది.

ఉత్తరం చదివి సంతకంచేసి పైన "ఫర్ ఇమిడియట్ ఎటెన్షన్ అండ్ నెసెసరీ ఏక్షన్" అని వ్రాసి ఉత్తరంవున్న ఫయిల్ పాడ్‌ను నావంక జరిపారు.

"సెండ్ దిస్ థ్రూ ఎ స్పెషల్ మెసెంజర్. ప్లీజ్ టేక్ ఎవే దీజ్ సర్వీస్ రిజిష్టర్స్" ఫయిల్లోకి తలదూర్చుతూ రావుగారన్న మాటలు.

పువ్వుల దుకాణం దగ్గర ఆగి పావలా మల్లెపూలు, పదిపైసలు మరువం తీసుకున్నాను శ్రీవారి అభిరుచులను తలచుకుంటూ. నేను ఇంటికి వెళ్ళేసరికి చిన్నవాడు గుమ్మంలోనే ఎదురొచ్చాడు.

"మమ్మీ! నాన్నారికి ఆఫీసులో యేదో పార్టీ వుందట. స్కూలునుంచి మమ్మల్ని ఇంటికి దిగబెట్టి ఆఫీసుకు వెళ్ళారు. ఎనిమిదయే సరికి వచ్చేస్తామని చెప్పారు" నా చేతులు పుచ్చుకుంటూ అన్నాడు.

నిండా తొమ్మిదేళ్ళు లేకపోయినా పొడుగ్గా బొద్దుగా పన్నెండేళ్ళవాడిలా కనిపిస్తాడు. వాడి భుజంచుట్టూ చేతులువేసి లోపలికి వెళ్ళాను. హాలులో కాన్వెంట్ యూనిఫామ్సు మార్చుకోకుండానే చెరో పుస్తకం పుచ్చుకొని సోఫామీద చదువుతూ కూర్చుని ఉన్నారు పాప, పెద్దవాడు. పదకొండేళ్ళకే పాప నా అంత పొడుగుంది.

చదువులో ముందడుగే కానీ ఇల్లును హాస్టల్‌గా మాత్రమే చూడ గలిగే మనస్తత్వం దానిది. ఇంట్లో పని ముట్టుకోదు. పెద్దవాడు ఈ విషయంలో దానికి పూర్తిగా విరుద్ధం. అటు చదువులో శ్రద్ధ కనపరుస్తూనే, ఇటు ఇంటి పనిలో కూడా నాకు చాతనయిన సహాయం చేస్తాడు. వాడొక్కడి మీద ఇల్లు వదిలేసి వెళ్ళినా జాగ్రత్తగా చూసుకునే సామర్థ్యం పదమూడేళ్ళకే వచ్చేసింది వాడికి. పెద్ద కొడు

## రచయిత గురించి

కొత్తగా కథలు రాస్తున్న నాకు రచయితగా చెప్పుకునేందుకు పెద్ద విశేషాలేమీ లేవు. నా ప్రధాన వృత్తి అయిన 'ఎకనామిక్స్ బోధన' నుంచి కొంత రిలీఫ్ పొందేందుకూ, తిరిగి శక్తి పుంజుకొనేందుకూ పాస్టైమ్‌గా రచనను స్వీకరించాను. ఫొటో ప్రచురించబడటం నాకు ఎంబరాసింగ్‌గా వుంటుంది.

—వి. ఎల్. ఆర్.

కులందరూ ఇంతేనేమో. వయసుకి మించిన బాధ్యతా భావం ఉంటుందేమో వాళ్ళకి.

"అమ్మా! తమ్ముడు స్కూల్లో షూస్ పారేసుకున్నాడు. వాడ్నేమీ అనకుండా మరో పెయిర్ కొనమ్మా" అన్నాడు జాలిగా మొహంపెట్టి.

వాడ్ని దెబ్బలాడకుండా ఉండటం కోసం వాడి తరపున వీడు వకాల్తా పుచ్చుకున్నాడన్న మాట. ఈ వెధవకి షూస్ పారేసుకున్నానన్న చింతే లేదు. వీడికి మాత్రం వాడంటే అంత శ్రద్ధ.

"ఎలా పోయాయిరా" అడిగేను.

"ఇంట్రవెల్‌లో షూస్ తీసి పక్కనపెట్టి స్నేహితులలో ఆడుకుందికి వెళ్ళేడుట. తిరిగి వచ్చి చూస్తే అవిలేవు" అన్నాడు.

నెలక్రితమే పాతిక రూపాయలు పెట్టికొన్న జోళ్లు. నాలుగు నెలలకన్న వాడి దగ్గర షూస్ మన్నవు. ఇంక పారెయ్యడం కూడ మొద లెడితే .

"సరే! నాన్నగార్కి చెప్పి మరో జత కొని పెస్తాను కాని, వాళ్లిద్దర్నీ పిలు. బోర్నవిటా తాగి ఆడుకుందికి వెళ్తురు కాని" అన్నాను, మధ్య తరగతి జీవితంలోని సమస్యల్ని గురించి ఆలోచిస్తూ.

ఈ ముగ్గురి స్కూలు ఫీజు, ఇతర అవసరాలు, ఆటో ఛార్జిలకే నా జీతం సరిపోతుంది. ఆయన జీతంలో కోతలు పోగా మిగిలింది మధ్య తరగతి విలువలకు తలఒగ్గుతూసంసారం ఈడ్చడానికి బొటాబొటిగా సరిపోతుంది. కొత్త అవసరాల్ని సృష్టిస్తున్న ఆర్థిక వ్యవస్థ అందరికీ అందుకు తగినట్టు ఆదాయాన్ని పెంచడం లేదు.

స్టవ్ మీద కుక్కర్ పెట్టి, హాలులో కొచ్చి ఏ. జె. క్రోనిన్ "ది జూడాస్ట్రీ" నవల చదువుతూ కూర్చున్నాను.

"హాయ్ లేడీ!" అంటూ ఆయన నా చెయ్యందుకుని వేళ్ల రాస్తూ ఉండేసరికి నవలలో "మేరీ" గురించి ఆలోచిస్తూ నిద్రలో కొరిగిన నాకు తెలివొచ్చింది.

"సరసూ! ఈ ఉద్యోగం మానేసి హాయిగా ఇంట్లోనే ఉండి నన్నూ, పిల్లల్నీ చూసుకుందూ. ఈ అలసట నిద్రలకి స్వస్తి చెప్పొచ్చు" ఆప్యాయంగా అన్నారు, నా అరచేతిని తన ముఖంమీదికి తీసుకుంటూ.

"మీ చిన్న దొరగారు జోడు పారేసుకున్నాడట. నోరు మెదపకుండా కొత్తవి కొనమని మీ పెద్దనానిగారి రికమండేషన్" నవ్వుతూ అన్నాను.

"పోనిద్దూ! మనసు పారేసుకుని మగువకి గులామ్ అయే ముందు మగాడు పారేసుకునేవి చాలా ఉంటాయి" నన్ను దగ్గరకు తీసుకుని నా భుజంమీద తలపెట్టి నాతలలోని మల్లెల న్నాఘ్రాణిస్తూ నామెడ వెనక తన పెదవులతో గిలిపెడుతూ అన్నారు శ్రీవారు.

"మీకు మల్లెల సువాసన, నాకు మీచొక్కా" అన్నాను, ఆయన్ని మృదువుగా ముందుకు నెడుతూ.

ముఖం చిన్నబుచ్చుకుని వెంటనే నిజం గ్రహించి చిరునవ్వుతో నా భుజం తడుతూ బట్టలు మార్చుకుందికి ఇంట్లోకి నడిచారు.

పిల్లలకి వడ్డించి వాళ్ళు భోజనం చేసిన తర్వాత వంటింట్లోంచి బయటపడ్డాను.

స్నానంచేసి లుంగీ, బనియను వేసుకుని బెడ్ రూంలో వాలుకుర్చీలో ధ్యానముద్రలో ఉన్నారు శ్రీవారు. ప్రతి రాత్రి భోజనానికి ముందు తొంభై ఎమ్ఎల్ మేరకు 'బ్లాక్ నైట్' విస్కీ ఆయన ధ్యానానికి ఆధారం. పదేళ్ళ క్రిందట హైదరాబాదు వచ్చిన దగ్గర్నుంచి ఆయన కయిన అలవాటది. ఆయన అలవాట్లను విమర్శించకుండా సర్దుకుపోవడం నేను చేసుకొన్న అలవాటు. చూపుడు వేలుకు సగ భాగంవరకూ విస్కీ గ్లాసులోపోసి గ్లాసునిండే వరకూ నీళ్లు పోస్తారు. ఆ గ్లాసును పూర్తి చేయడానికి సుమారు అరగంట పడుతుంది. అదే ఆపరేషన్ మరోసారి రిపీట్ చేస్తారు. తొమ్మిదిన్నర, పది అయేసరికి భోజనానికి లేస్తారు. పిల్లల భోజనానికి, శ్రీవారి భోజనానికి మధ్య కాలంలో నాకు తోచినప్పుడు నేను బోంచేస్తాను. ఆఫీసు విషయాలో, నేను చదివిన నవల గురించో మాట్లాడుతూ ఆయనకి కంపెనీ ఇస్తాను. "ది జూడాస్ ట్రీ" నవల గురించి చెప్తున్నాను.

"సరూ! ఈ అలవాటుకి బానిసనయిన నన్ను చూస్తే నీకు కోపం రావడంలేదూ?" నా కథ కడ్డొస్తూ సీరియస్‌గా అన్నారు.

ఎన్నడూ లేనిది ఇన్నేళ్ళ తర్వాత ఆయన ఈ ప్రశ్న వేయడం ఆశ్చర్యం వేసింది. ఒకరి అలవాట్ల నరికట్టడానికి మరొకరు పూనుకోవడం అవివేకమని నా అభిప్రాయం.

"మీకు అందులో ఏదో సుఖమో, ఆనందమో, తృప్తో ఉండి తాగుతున్నారు. మీ అలవాటును ప్రశ్నించడం మీ వ్యక్తిత్వాన్ని ప్రశ్నించడమే. వ్యక్తిత్వంలేని వ్యక్తిని నా భర్తగా ఊహించలేను" లైటర్ వీన్‌లో గంభీరతనటిస్తూ అన్నాను.

"ఇది దురలవాటు కాదంటావా?" ఆశ్చర్యంగా కళ్లు పెద్దవి చేస్తూ అడిగారు.

"అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు. మితంగా ఉన్నంతవరకూ ఏ అలవాటు దురలవాటు అవదు" అన్నాను మొండిగా.

"మితంగా వ్యభిచరించడం కూడ తప్పు కాదంటావు" వాదనలో ఓడిపోవడం ఇష్టంలేని ఉడుకు మోత్తనం తొంగిచూసింది ఆయన మాటల్లో.

ఇక ఈ ధోరణిలో సంభాషణ సాగించడం మంచిది కాదనిపించింది.

"మీ మొదటి ప్రశ్నకు వద్దాం. ఇన్నాళ్ళు లేంది మీ తాగుడు గురించి ఆలోచన ఈవేళెందు కొచ్చింది" అన్నాను మాట మారుస్తూ.

"ఏంలేదు! పిల్లలు పెద్ద వాళ్ళవుతున్నారు. ఖర్చులు పెరుగుతున్నాయి. అనవసరపు ఖర్చులు తగ్గించు కోవడం మంచిదేమో అని" కళ్ళుమూసుకొని ఆలోచిస్తూ అన్నారు.

ఆయన ఏం చేసినా నిబ్బరంగా ఉండటానికి కారణం ఇదే. సెల్ఫ్ ఇంట్రాస్పెక్షన్ చేసుకొని తన్నుతాను సరిదిద్దుకొనే సమర్థత ఉన్న వ్యక్తి ఆయన. బాధ్యతలు మరచి పోనివ్వని వ్యక్తిత్వం ఆయనది. అవే మా స్థిరాస్థి.


"అంతేనా లేకపోతే మీ ఖర్చులు తగ్గించుకొని నన్ను ఉద్యోగం మానేయమందామనా?" ఆఫీసునుంచి వచ్చిన తర్వాత ఆయనన్న మాటలు గుర్తుకు తెచ్చుకొంటూ నా తలని ఆయన ఒళ్ళోకి చేరుస్తూ అన్నాను.

ఆయన నా తలరాస్తూ కొంతసేపు మాట్లాడ లేదు. రెండు చేతుల్తో నా ముఖం ఎత్తి నాకళ్ళలోకి చూస్తూ___

"నీ అందుబాటు నాకు కొంచెంగా ఉన్నప్పుడే మన ప్రేమ నిత్యనూతనంగా ఉంటుంది. నిన్ను ఉద్యోగానికి పంపిస్తున్నది నీ ఆర్జన కోసం మాత్రమే కాదు. జీవితం అనుభవాల సముదాయం. ఆ అనుభవాల సంచయనంలో పురుషుడికి ఎంత స్వేచ్ఛ అవసరమో స్త్రీకి కూడ అంతే స్వేచ్ఛ అవసరం. అందుకే నిన్ను వంటింటికి, పడకటింటికి మాత్రమే అంకితం చేయకుండా ఆఫీసుకు పంపుతున్నాను" అన్నారు.

ఇందాకటి నా అహంకారపు సమాధానాలకు రిటార్టా అన్నట్లుంది ఆయన చిన్న సైజు ఉపన్యాసం.

"దిస్ ఈజ్ ది లాస్ట్ బాటిల్ ఫర్ మి టు




కిల్" నిర్ణయానికి వచ్చిన వ్యక్తిలా బాటిల్ బీరువాలో పెట్టి భోజనానికి లేచారు. విశాలమైన నుదురున్న ఆయన ముఖంలో ఏదో కాంతి స్పష్టంగా కనిపించింది. తనకు తానుగా తీసు కొన్న మంచి నిర్ణయం వలన కలిగిన ఆనం దానికి నాకాళ్లు వణుకుతూ ఉంటే ఆయన వెంట వంటింట్లోకి నడిచాను.

మరునాడు ఆఫీసులో కొత్తఅనుభవం ఎదు రయింది. ఆఫీసు టైములో మూడునాల్గుసార్లు డైరెక్టర్ రావుగారి గదిలోకి వెళ్ళాను. ప్రతీ సారి ఆయన చూపులు నా శరీరాన్నంతా తడుముతున్నట్టు అనిపించింది. ముగ్గురు పిల్లల్ని కని నడివయస్సులోకి జారుకొంటున్న నా స్త్రీత్వం విపరీతంగా సిగ్గుపడింది. ఇప్పుడు కూడ పరాయి మగాణ్ణి ఆకర్షించే రూపం నాకున్నందుకు నా మనసు గర్వంతో పొంగింది. పరస్పరం విరుద్ధంగా ఉన్న ఈ ఆలోచనలతో బస్‌స్టాప్‌నుండి ఇంటికి రావడం రిఫ్లెక్సుల సాయంతోనే జరిగిపోయింది. పిల్లల సంగతి చూసిన తర్వాత పోస్టులో వచ్చిన ఉత్తరాలు చూశాను. నా పేరుతో ఒక ఉత్తరం ఉంది. రమాదేవి దస్తూరి. కవరు విప్పాను.

డియర్ సరసూ,

రెండునెలల క్రిందట విశాఖనుంచి వ్రాసిన ఉత్తరానికి నీనుంచి సమాధానమేమీ లేదు. నీలా కాపురం చేస్తున్న దానినే, నాకున్న తీరిక ఓపిక నీ కెందుకులేవే? రేపే బిమ్. మావారికి ట్రాన్స్‌ఫరయి ఈ ఊరొచ్చేం. ఇక్కడకువచ్చిన కొద్ది రోజులకే తెలిసింది, మన క్లాస్‌మేట్ వెంకటరమణ గురించి. గుర్తుందా? ఎర్రగా, పొడుగ్గా సన్నగా ఉండేవాడు. ఇవాంజలికల్ ఫేస్. క్లాసవుతున్నంతసేపు అతన్ని చూస్తూనే గడపేసేదాన్ని. క్లాసులో అతను వేసిన ప్రశ్నలు ఇప్పటికీ గుర్తున్నాయ్. చదువులో చురుకు దనం. ఆటల్లో తప్ప మిగతా అన్ని ఏక్టివి టీస్‌లో పాల్గొని బహుమతులు కొట్టేసేవాడు. కోరి పలకరిస్తే రెండు మూడు 'ఊ' 'ఆ' లతో పొడిపొడి మాటలతో సంభాషణముగించి జారుకునేవాడు. నాలోనే నా ప్రేమ ఉండి పోయింది. యూనివర్సిటీలో హాయిగా గడిపిన ఆరోజులు కాలగర్భంలో కలిసిపోయాయి. అతని రూపం, వేదికమీద ఉద్రేకంగా మాట్లాడుతున్నప్పుడు ఎర్రపడి చూడ ముచ్చ టగా ఉండే అతని ముఖం నా మనసులో నిలిచి పోయాయి. ఇంతా ఎందుకు వ్రాస్తున్నానంటే పన్నెండేళ్ళ తర్వాత మళ్ళీ రమణ గురించిన

వివరాలు తెలిశాయి.

మా ఇంటి ప్రక్క వాళ్ళకి దగ్గర చుట్టం అతను. ఈ మధ్యే వచ్చి వెళ్ళాడు. మనిషి రూపం పూర్తిగా మారిపోయింది. అతనువెళ్ళిన తర్వాత పక్కావిడ అతని గురించి వివరాలు చెప్పింది. గవర్నమెంటులో ప్రస్తుతం పెద్ద ఉద్యోగమేనట. ప్రేమించి పెళ్ళి చేసుకొన్నా డట. పెళ్ళయిన నాలుగేళ్ళకే ఇద్దరు పిల్లల్ని (ఒక బాబు, ఒక పాప) తనకు గుర్తుగా వది లేసి భార్య చనిపోయింది. ఆ షాకుతో మనిషి మళ్ళీ ప్రజల్లో పడతాడా ఎప్పటికైనా అన్నం తగా మారిపోయాడట. విపరీతంగా త్రాగుడు కలవాటు పడ్డాడు. అతను త్రాగకుండా ఉండ నిది ఆఫీసులో గడిపే కొన్ని గంటలు మాత్రమే. కొన్నాళ్ళ తర్వాత ఆ పిల్లల కోసం అన్నట్టు మామూలు మనిషయేడట. చుట్టాలు ఎంత చెప్పినా మళ్ళీ పెళ్ళి కంగీకరించలేదుట. ఈ మధ్యే గుంటూరునుంచి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫరయిందట.

ఒకటి రెండుసార్లు ఇక్కడ అతన్ని చూసి నందుకే నా మనసు సంతోషంతో నిండి పోయింది. నాకు గుర్తున్న రూపం కాక పోయినా, ఆ ముఖంలో దైవత్వం మాసి పోలేదు.

తొలి ప్రేమ మధురమైనదేకాదు. మరువ లేని దనిపిస్తుంది. పెళ్ళి పలకరించే ధైర్యం లేకపోయింది. నాది మూగ ప్రేమగానే మిగిలి పోయింది.

ఈ నా ప్రేమ కబుర్లతో కొన్నేళ్ళ తర్వాత మళ్ళీ నిన్ను బోరు కొడుతున్నానని నవ్వు కొంటున్నావు కదూ! అవునులే ఇలాంటి మధుర భావాలు నీలాంటి మొద్దులకేం బోధపడ తాయి! పిల్లలు తలుపు తడ్తున్నారు. ఉంటాను.

నీ —రమ

ఉత్తరం చదివి నిజంగానే నవ్వుకున్నాను. దాని పోరు పడలేక ఎప్పుడో ఒకసారి చూసి నట్టు గుర్తు దాని ప్రియుణ్ణి. చాలా మామూలు రూపం. రోజు కొకసారైనా అతన్ని తల్చు కొని అతని కబుర్లతో నన్ను విసిగించేది. భావుకతలో నిండిన రమ నే నెన్నటికీ మరచి పోలేని మంచి స్నేహితురాలు. కలల్లో విహ రించే అమాయకురాలు.

"ఏవిటీ! దేవిగారి కేమైనా ప్రేమలేఖ వచ్చిందా. ఉత్తరం తొడ మీదుంచుకొని ఆలో చనలో పడ్డారు."

మావారి మాటల్తో ప్రస్తుతానికి వచ్చాను. ఆఫీసులో "చూపులు" గుర్తుకొచ్చాయి.

"ఏవండీ! ఒక మగాడు ఒక స్త్రీని గుచ్చి గుచ్చి చూస్తే అర్థం ఏమిటండీ" టాపిక్ సీరియస్‌దైనా హాస్య ధోరణిలో సంభాషణ ప్రారంభించాను.

"ఏముంది. ఆ స్త్రీ అందమైనదైనా అయుం డాలి, లేదా ఆశ్చర్యాన్ని కలిగించే కురూపైనా అయ్యుండాలి" షూలేసెస్ విప్పుతూ అన్నారు.

"ఆ స్త్రీ మీ ఆవిడే అయి, ఆ పురుషుడు ఆమె బాసయితే?" డైరక్టుగా విషయాని కొచ్చాను.

"నిన్ను ఉద్యోగం మానేయమని, ఇంటికే అంకిత మవమని శాసించను. మీ బాస్ టేస్టుని మెచ్చుకొంటాను." బట్టలు మార్చు కుందికి గదిలోకి వెళ్తూ అన్నారు.

ఆయన విశాల హృదయానికి, నేనంటే ఆయనకున్న నమ్మకానికి ఆశ్చర్యపోయాను. సంతోషంతో కూడిన గర్వంతో నా మనసు నిండిపోయింది. అలవిమాలిన ప్రేమ వున్న చోటే అనుమానం ఉంటుందంటారు. ఆయనకి నేనంటే అనుమానం కలిగేంత ప్రేమలేదా? అసలు ప్రేమంటే? రమ దగ్గర ఉంటే ఎంత బాగుండేది. ఈ ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు చెప్పేది. దానికీ విషయాలు బాగా తెల్సు.

బట్టలు మార్చుకొని వచ్చి ఇంకా హాలులో సోఫాలోనే స్తబ్దంగా కూర్చున్న నన్నుచూసి—

"ఏవిటీ సరసూ! యూ ఆర్ బికమింగ్ బెటరీ! ఏం జరిగింది? మీ ఆఫీసర్ నిన్ను పదే పదే ఆశగా చూశాడు. ముగ్గురు పిల్లల్ని కన్నా, పెళ్ళి కెదిగొచ్చిన కన్యలా ఉన్న నిన్ను ఏ మగాడు చూడడు? చూసి గుటకలు

వెయ్యడు? ఇన్నాళ్ళు నువ్వు అబ్జర్వ్ చెయ్యలేదు అంతే. అందమైన వస్తువుల్ని, ప్రకృతిలోని సొగసుల్ని చూసి ఆనందించడానికే కళ్ళున్నది మనకు. 'పరస్త్రీని కన్నెత్తి చూడకు', 'పరపురుషుడి నీడ కూడ నీమీద పడనీయకు' లాంటి అసహజ నియమాల్ని మనకు నూరిపోసి జీవితంలో ఎంతో థ్రిల్‌ని పోగొట్టుకొనేట్టు జేశారు మన పూర్వీకులు. మన సంస్కృతి అంతే అనను కాని, స్త్రీ పురుష సంబంధాల విషయంలో మాత్రం మనవాళ్ళ నియమాలకు ఆధారం భయం, అనుమానం."

ఆయన మాటలు ఆశ్చర్యంగా వింటూ కూర్చున్నాను. ఆయన స్వభావంలో ఇన్నాళ్ల నాకు తెలియని డైమన్షన్ ఉన్న సంగతి ఇప్పుడు తెలిసింది. నా అదృష్టానికి పొంగిపోయాను. ఆ విషయం అక్కడతో ఆపేశాను.

ఆఫీసులో రావుగారి చూపులు నాలో సిగ్గుని భయాన్ని కలిగించలేదు. చొరవగా స్నేహంగానే "మూవ్" అవుతున్నాను. ఆయన కూడ అవసరం మేరకు తప్ప అనవసరంగా నన్ను తన గదిలోకి రప్పించుకోవడంలేదు.

అర్జంటు పేపర్లు టైపు చెయ్యడం పూర్తికాక ఆరు గంటలువరకూ ఆఫీసులోనే ఉండిపోయాను. ప్యూన్, డైరెక్టర్, నేనే ఆఫీసులో ఉన్నది. టైపుచేసిన కాగితాలు సంతకం జేయడానికి రావుగారు ఆఫీసులోనే ఉండాల్సి వచ్చింది. టైపు చేయడం పూర్తిచేసి ఫైల్సు పుచ్చుకొని సంతకాల కోసం ఆయన గదిలోకి వెళ్ళాను. కళ్ళు మూసుకొని కుర్చీలో వెనక్కివాలి ఉన్నారాయన.

"సర్" అన్న నా పిలుపుకి కళ్లు తెరిచారు. నన్ను అదే పనిగా కొన్ని క్షణాలు చూశారు. కొత్త పోయిన నేను కూడ సూటిగా ఆయన వైపు చూసేసరికి కళ్ళుదించుకొని ఫైల్సు దగ్గరకు తీసుకొన్నారు. ఆ గదిలో ఒంటరిగా ఆయన కెదురుగా నేను. మూసిఉన్నతలుపులు. నా గుండెల శబ్దం నా గొంతులో వినిపిస్తోంది. రక్తమంతా నా ముఖంలోకి వచ్చినంతగా చెవుల్లోంచి వేడి గాడ్పులు. ఏదో తెలియని భయం ఆతృత, ఉత్కంఠ, అనుమానం నాలో చోటు చేసుకొన్నాయి. నిటారుగా నిలబడలేక కుర్చీని ఆసరాగా చేసుకొని నిల్చున్నాను.

"సారీ ఫర్ హోల్డింగ్ యు అప్ ఏఫ్టర్ ఆఫీస్ టైమ్.థ్యాంక్యూ, యు కెన్ గో నవ్" అన్నారు.

గదిలోంచి బయటపడి నిండుగా ఊపిరి పీల్చుకొన్నాను. ఆధారంలేని నా భయాలకి నాలో నేనే నవ్వుకొన్నాను.

ఆ రాత్రి శ్రీవారి గుండెలమీద తలపెట్టుకొని ఆయన భుజాల్ని రాస్తూ జరిగింది వివరంగా చెప్పాను.

"యూ ఆర్ స్టిల్ టూ గర్లిష్. నీలో

---

(వి) చిత్ర విజ్ఞానం



జిరాఫీల నివాసస్థలం ఉత్తర దక్షిణాఫ్రికాలలోని అడవులు. వీటి సంఖ్య ప్రస్తుతం బాగా తగ్గిపోయి, ఇవి అతిత్వరలో విలుప్తం చెందే సూచనలున్నాయి. జిరాఫీల ముఖ్య శత్రువులు సింహం, చిరుతపులి, మొసలి. జిరాఫీలు ఎప్పుడు గుంపులు గుంపులుగా సంచరిస్తాయి. మగ జిరాఫీలు సుమారు 19 అడుగుల పొడవుకు ఎదగగలవు. అప్పుడే పుట్టిన జిరాఫీపిల్ల సుమారు 6 అడుగుల పొడుగుతో 120 పౌనుల బరువు కలిగివుంటుంది. ఆఫ్రికాలో కెన్యా—ఉగాండాల మధ్య రైలుమార్గం నిర్మించినపుడు యీ మృగాలు టెలిగ్రాఫ్ తీగలను తెంపివేసేవట! వీటి బారినుండి వైర్లను కాపాడ్డానికి వాటిని 25 అడుగుల ఎత్తున వుంచారు!

ప్రామినెంటుగా ఉండే స్త్రీత్వం నీ లోకజ్ఞానపు గొంతు నొక్కుతోంది. లెర్న్ ఇట్ యువర్ సెల్ఫ్ దిహార్డెస్ట్ వే" అన్నారు నన్ను ఇంకా దగ్గరికి తీసుకొంటూ.

నాకు, సోమనాధంగార్కి ప్రమోషనార్డర్సు వచ్చాయి. మేము స్వయంగా రావుగార్ని కలసి మేమివ్వబోయే పార్టీ గురించి చెప్పాం. ఆయన్ని ముఖ్య అతిథిగా ఆహ్వానించాం.

"మంచి జరిగినపుడు సంతోషించడం, చెడు జరిగినపుడు దుఃఖించడం మనం నిత్యం అనుభవించే ఇమోషన్సు. మంచి జరిగినపుడు సెలబ్రేట్ చేసుకోవడం, చెడు జరిగినపుడు క్రుంగిపోవడం మన అల్పత్వానికి బాహ్య స్వరూపాన్నివ్వటమే అవుతుంది. న్యాయంగా మీకు ఎప్పుడో జరగాల్సిన మంచి ఇప్పుడు జరిగింది. మీ ఇష్టాన్ని నేను కాదనను. మిగతా స్టాఫ్‌తో మీరు సెలబ్రేట్ చేసుకోండి. నలుగురిలో కలిసి సరదాగా గడిపే అదృష్టాన్ని నే నెప్పుడో కోల్పోయాను. పార్టీలంటే నాకు కిట్టదు. ఐ లాస్ట్ మై సెల్ఫ్ ఇన్ ఎ క్రౌడ్! ఆఖరి వాక్యాలు చెప్తున్నప్పుడు ఆయన గొంతులో ఆవేదన స్పష్టంగా తెలుస్తోంది.

మరునాడు ఆఫీసుకి వెళ్ళేసరికి ఎందుకో అందరూ కదలిక లేకుండా నిశ్శబ్దంగా వారి వారి సీట్ల కతుక్కుపోయారు. నా సీటు దగ్గరికి వెళ్ళేసరికి టేబిల్‌మీద ఒక కాగితం ఉంది. చదివాను.

"ఐ ఎంజాయ్‌డ్ వర్కింగ్ విత్ యూ ది పాస్టు ఫ్యూ మంత్స్. గుడ్ లక్ ఎండ్ గుడ్ బై" రావుగారి చేతి వ్రాత అది.

"అందరికీ అదే ఉత్తరం తల్లీ. ఆ మంచి మనిషి మెరుపులా క్షణకాలం మెరిసి మనకు మంచిచేసి కోరి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని ఢిల్లీకి వెళ్ళిపోయారు. ఇదిగో ఆయన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు కాపీ. కొత్త డైరెక్టర్ వచ్చేవరకూ ఇన్‌చార్జిని నేనే" అన్నారు సోమనాధంగారు ట్రాన్స్‌ఫరార్డరు కాపీని నాకు చూపిస్తూ.

ఏదో ఆప్తుడు దూరమయినట్టుగా బాధ గలిగింది నాకు.

"సరస్వతీ ఈ ట్రాన్స్‌ఫర్‌కన్న వింతైన విషయం. ఆయన్ను రోజుకు మూడు నాల్గుసార్లయిన చూస్తూ ఉండే దానివి. ఆయన విపరీతంగా త్రాగుతాడంటే నమ్ముతావా?" ఆయనే అన్నారు.

నేనేం అనలేదు. విస్తుపోతూ టేబిల్ నానుకొని నిల్చున్నాను.

"ప్యూన్ కనకారావు ఇల్లు సర్దుతూ ఉంటే స్టోరు రూములో ఖాళీ విస్కీ సీసాలు దండిగా ఉన్నాయట."

దూరంగా తలవంచుకొని నిల్చున్న కనకారావు వైపు చూశాను. వాడు నిజమే అన్నట్టు తల ఊపేడు.

"ఆయన మనసుకు ఏ గాయం తగిలిందో, ఆయన్ని ఏ సమస్య పీడిస్తోందో, మంచి తనానికి వేయి రకాలుగా సమాధికట్టే ఈ కుళ్ళిన సంఘం ఆయనకే మన్యాయం చేసిందో—లేకపోతే దేవుడులాంటి మనిషి త్రాగుబోతా?" సోమనాదంగారు ఆవేదనతో అన్నమాటలు. ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూంటే చూడలేక తలదించుకొన్నాను.

"పోనీ మన మందరం ఆయన ఇంటికి వెళ్ళి ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ చేసుకోమని రిక్వెస్టు చేస్తే" అన్నాను, ఆయనను ఇక్కడే ఉండేట్టు చేయాలన్న ఆతృతతో.

"ఆ అవకాశం ఆయన మన కివ్వలేదమ్మా! నిన్న సాయంత్రం ఫ్లయిటుకే ఢిల్లీ వెళ్ళిపోయారు" నిరాశగా అన్నారు సోమనాధంగారు.

ఆ రోజు ఆఫీసులో పనేం జరగలేదు.


ఇంటికివచ్చి జరిగింది మా ఆయనకు చెప్పాను.

కొంతసేపు నిశ్శబ్దంగా వుండి శూన్యంలోకి చూస్తూ" "ఇట్ ఈజ్ లైఫ్" అన్నారు. అంతే.

మరునాడు ఆఫీసునుండి ఇంటి కొచ్చేసరికి ఉత్తరాల్లో రావుగారి దస్తూరితో కవరు. కవరు విప్పి కాగితాలు బయటకు తీశాను.

శ్రీమతి సరస్వతి,

కొన్నేళ్ళ క్రిందట వ్రాయాల్సింది. చొరవ ధైర్యం లేక వ్రాయలేదు. వ్రాయసందుకు




అప్పుడు విచారించలేదు. ప్రేమంటే నమ్మకం లేని నేను మరొకరంటే ఇష్టపడి పెళ్ళి చేసుకొన్నాను. కొన్నాళ్ళు జీవితం హాయిగానే నడిచిపోయింది, ఇద్దరు పిల్లల్ని నా కొదిలి, ఆమె దేవుణ్ణి చేరుకొంది. ప్రేమంటే అప్పుడు తెల్సింది. వియోగంలోని నరకం అనుభవంలోకి వచ్చింది. కొన్నాళ్ళు "మత్తు"లో అస్తిత్వాన్నే మరచిపోయాను. పిల్లల కోసం మామూలు మనిషయ్యాను. మనుగడ కొనసాగిస్తూ వచ్చాను. ఇక్కడ నిన్ను చూశాను.

రమాదేవి, నువ్వు కలసి తిరుగుతుండే వాళ్ళు. అమ్మాయిల్ని చూడాలన్నా, వాళ్ళతో మాట్లాడాలన్నా సహజంగా నాకు ఉండే భయం, బిడియం నుంచి నీతో మాట్లాడ్డానికి ప్రయత్నించలేదు ఎప్పుడూ. మీ ఫ్రెండు రమాదేవి కోరి పలకరించినప్పుడు కూడ ఎడ్వాంటేజ్ తీసుకొని నీతో మాటలు కలిపి స్నేహం చెయ్యడానికి తెగింపు లేకపోయింది. ఏ పనీ చేసినప్పుడు నా మనసులో నీ రూపమే కదిలేది. నీ గురించి ఆలోచనలతో నా మనసు నిండి పోయేది.

ఇక్కడ నిన్ను చూసిన క్షణంనించి బండ బారిందనుకొన్న నా మనసు 'బలహీనమవడం ప్రారంభమయింది. ఏదో చెప్పాలని, నీనుంచి ఓదార్పు పొందాలని, నిన్ను చూస్తూ గంటలు గడిపేయాలని తీరని తీవ్రమైన కోరికలు, తపన. ఎన్నో రాత్రులు నిద్రపోకుండా నీ గురించిన ఆలోచనల్తో పూర్తిగా తెలివితప్పే వరకూ తాగుతూ గడిపాను. వదిలిందనుకొన్న పాడు అలవాటు మళ్ళీ నన్ను బానిసను చేసుకొంది. పగలు నీరూపం ప్రత్యక్షంగా చూసి, ఆరూపాన్ని మనసులో ముద్రించుకొని రాత్రి గుర్తుకు తెచ్చుకొని సంతృప్తి పడుతుండే వాణ్ణి. బాధపడుతుండేవాణ్ణి. ఇంక ఇక్కడ ఉండడం అసంభవమని తెలుసుకొన్నాను. తాగుడు కబంధ హస్తాల్లోంచి నన్ను నేను రక్షించుకోవాలంటే నీకు దూరంగా వెళ్ళిపోవాలి. అందుకే వెళ్ళిపోతున్నాను.

శుభాకాంక్షలతో.
రాఘవరావు.

తడిసిన కళ్ళతో ఉత్తరం వైపుచూస్తూ కొన్ని క్షణాలు శిలనే అయిపోయాను. రమాదేవి ఉత్తరం దాని రూపం మనసులో మెదిలేయి. రావుగారి చూపులు గుర్తుకొచ్చాయి. "ఇట్ ఈజ్ లైఫ్" మా వారి మాటలు మెదడులో ఖంగుమని మ్రోగాయి.

ఏడుస్తూ మా చిన్నవాడు "అమ్మా! అన్నయ్య ఆటలో నా చొక్కా చింపేశాడు చూడమ్మా" అన్నాడు.

"వాడు చింపాలని చింపలేదు నాన్నా" అన్నాను, దుఃఖాన్ని ఆపుకుంటూ. □